నమస్తే తెలంగాణ
DISTRICT SUPPLEMENT


# రాజన్న సిరిసిల్ల






ప్రజా ఆశీర్వాద సభలో నినదిస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్, సిరిసిల్ల ఎమ్మెల్యే అభ్యర్థి మంత్రి కేటీఆర్

## కేటీఆర్‌ను దీవించండి

సిరిసిల్ల అభివృద్ధికి నా సహకారం ఎల్లప్పుడూ ఉంటుంది. భవిష్యత్తులో కూడా సిరిసిల్ల ఒక విద్యాకేంద్రంగా, ఒక అకాడమిక్ సెంటర్‌గా మారుతుంది. మళ్లీ మనమే గెలుస్తాం. ఇంకా అభివృద్ధి చేసుకుందాం. అందులో ఎవరికి ఎటువంటి అనుమానమూ లేదు. మీ నాయకుడు రామారావుకు మంచి భవిష్యత్ ఉన్నది. మీ నాయకుడి గుణ గుణాలు నా కంటే మీకే ఎక్కువ తెలుసు. ఎంత పనివంతుడో మీకు తెలుసు. అందుకే చెబుతున్న. మంచి మెజార్టీ ఇచ్చి ఆశీర్వదించాలని కోరుతున్న. మోసపూరిత పార్టీల మాటలు విని ఆగం కావద్దు. **- ముఖ్యమంత్రి కేసీఆర్**



సిరిసిల్ల ప్రజా ఆశీర్వాద సభలో అశేషంగా హాజరైన జనం, మనమే గెలుస్తామంటూ ధీమా వ్యక్తం చేస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్

**అధినేత కేసీఆర్‌కు జైకొట్టిన జనం**

# మనమే గెలుస్తాం

## మీ ఆశీస్సులతో తప్పకుండా విజయం సాధిస్తాం

4లో..





అభివాదం చేస్తున్న మంత్రి కేటీఆర్

మళ్లీ మనమే గెలుస్తున్నామని, మీ ఆశీస్సులతో తప్పకుండా విజయం సాధిస్తామని బీఆర్ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కేసీఆర్ ధీమా వ్యక్తం చేశారు. చేనేత కార్మికులు ఈ రోజు చల్లగా బతికేటట్లు చేసిన మంత్రి కేటీఆర్‌ను మరోసారి మంచి మెజార్టీతో దీవించాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పుడు ఆగం జేసేవాళ్లు.. అబద్ధాలు చెప్పేవాళ్లు మీ ముందుకు వస్తున్నారని, వాళ్ల మాటలు విని మోసపోవద్దని సూచించారు. ఏమాత్రం ఏమరుపాటుగా ఉన్నా గోసపడే ప్రమాదమున్నదని హెచ్చరించారు. మంగళవారం సిరిసిల్లలో ప్రజా ఆశీర్వాద సభకు హాజరై, దాదాపు 20 నిమిషాలపాటు ఉత్తేజపూరితంగా ప్రసంగించారు. సమైక్య రాష్ట్రంలో కరువు పరిస్థితులు, నేతన్నల ఆత్మహత్యలను ప్రస్తావించారు. ఆనాడు ఎండిపోయిన ఎగువమానేరు, చుక్కనీరులేని మానేరును గుర్తు చేస్తూనే.. ప్రస్తుతం సజీవ జలధారగా మారడంపై సంతోషం వ్యక్తం చేశారు. నాటి కాంగ్రెస్ పాలనను ఎండగడుతూనే.. మళ్లీ కష్టాలు కొని తెచ్చుకుందామా..? అంటూ ప్రశ్నించారు. స్వరాష్ట్రంలో జరిగిన అభివృద్ధిని వివరిస్తూనే.. మంత్రి కేటీఆర్‌పై ప్రశంసల వర్షం కురిపించారు. మీ నాయకుడికి మంచి భవిష్యత్ ఉందంటూ ఆశీర్వదించారు. సిరిసిల్ల అభివృద్ధికి తన సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. నాటికి నేటికీ ఎలా మారిందో ఒక్కసారి పోల్చి చూడాలని ప్రజలకు సూచించారు.

**- కరీంనగర్, అక్టోబర్ 17 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)**

- నేను, ప్రభుత్వం మీ వెంట ఉన్నం
- సిరిసిల్ల అభివృద్ధికి నా సహకారం ఎల్లప్పడూ ఉంటుంది
- ఈ ప్రాంతంతో విడదీయలేని బంధం నాది
- సమైక్య పాలనలో ఎగువమానేరు దుమ్ములేచింది
- నేడు మానేరు సజీవ జలధారగా మారింది
- మండుటెండల్లో మత్తడి దుంకుతుంటే సంతోషంగా ఉన్నది
- ఆనాడు నేతన్నల ఆత్మహత్యలను చూసి చలించిపోయా
- ఈనాడు మీ దగ్గర మంచి నాయకుడున్నడు
- మీ మంత్రి కష్టపడి పనిచేస్తున్నడు
- కార్మికుల కన్నీళ్లు తుడిచేందుకే బతుకమ్మ చీరెలు
- ఎన్నికల వేళ మళ్లీ మోసగాళ్లు వస్తున్నరు
- వాళ్ల మాటలు విని ఆగం కావద్దు
- సిరిసిల్ల ప్రజా ఆశీర్వాద సభలో ముఖ్యమంత్రి కేసీఆర్
- మంత్రి కేటీఆర్‌పై ప్రశంసల జల్లు

సీఎం కేసీఆర్ సభలో రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్ కుమార్, వేములవాడ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావుపై ప్రశంసలు కురిపించారు. కాబోయే ఎంపీ వినోద్, చల్మెడకు ఇక్కడ గాలి బాగానే ఉన్నదంటూ ఆశీర్వదించారు.

## ఇది చే(నే)తల ప్రభుత్వం

జిల్లాలో అభివృద్ధి కండ్ల ముందు కనిపిస్తున్నది. ఎర్రటి ఎండల్లో ఏప్రిల్ నెలలో అప్పర్ మానేరు మత్తడి దుంకుతున్నదంటే దానికి కారణం ముఖ్యమంత్రి కేసీఆరే. కాళేశ్వరం జలాలతో మల్లన్న సాగర్ నింపి, అక్కడి నుంచి కాలువల ద్వారా మన బీళ్లకు వస్తున్నాయంటే అది ఆయన ఘనతే. నెర్రెలు బారిన ఈ నేలలో దశాబ్దాల తర్వాత ఈరోజు మొట్ట మొదటిసారి పుష్కలంగా నీళ్లను చూస్తున్నం. ఒక సిరిశాలగా పేరుగాంచిన సిరిసిల్ల ఉమ్మడి పాలనలో మా నేతన్నల ఆత్మహత్యలతో ఉరిశాలగా మారింది. కానీ, ఎప్పుడైతే కేసీఆర్ ముఖ్యమంత్రి అయ్యారో.. ఆనాడే సిరిసిల్ల నేతన్నల జీవితాలు మారినయ్. బతుకులు మారినయ్. ఇది చేతల ప్రభుత్వం.. చేనేతల ప్రభుత్వం, కేసీఆర్ ప్రభుత్వం. రాబోయే రోజుల్లో మా ఆడబిడ్డల ఆదరాభిమానాలతో, మా అన్నదమ్ముళ్ల ఆశీర్వాదాలతో తప్పకుండా గులాబీ జెండా ఎగురవేస్తాం. **- మంత్రి కేటీఆర్**



## రామన్నకు మద్దతుగా 22 సంఘాల ఏకగ్రీవ తీర్మానం

## జయహో కేసీఆర్

- కార్మిక క్షేత్రంలో ప్రజా ఆశీర్వాద సభ గ్రాండ్ సక్సెస్
- నియోజకవర్గం నలుమూలల నుంచి వేలాదిగా జనం
- ఉర్రూతలూగించిన ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రసంగం
- గులాబీ శ్రేణుల్లో నూతనోత్సాహం

మధ్యపేజీలో